సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



రోల్ 'మోడల్'గా నిలిచేందుకు..

గ్రామీణ, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. 10లో



75 కేజీల గంజాయి స్వాధీనం

రూ.15 లక్షల విలువైన 75 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పాల్వంచ పోలీసులు శనివారం పట్టుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 20°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. రాత్రి వేళ కూడా చలి ప్రభావం అంతంతమాత్రంగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా రుద్రహోమం



స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం అత్యంత వైభవోపేతంగా రుద్రహోమం నిర్వహించారు. ముందుగా వేళతాళాలు, వేదమంత్రాలతో అమ్మ, స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతి పూజ అనంతరం హోమం, చివరకు పూర్ణాహుతి జరిపించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మహాశివుడికి వెండి నాగాభరణం



అర్చకుడికి వెండి నాగాభరణాన్ని అందజేస్తున్న బ్రహ్మయ్య దంపతులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయంలోని మహా శివలింగానికి విజయవాడకు చెందిన సజ్జనపు బ్రహ్మయ్య అనే భక్తుడు మహా శివరాత్రి సందర్భంగా వెండి నాగాభరణాన్ని బహూకరించారు. రూ.1.30 లక్షల విలువైన నాగాభరణాన్ని ఆలయ అర్చకుడు మధుకుమార్ శర్మకు అందజేశారు.

24వరకు దూరవిద్య డిగ్రీ ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా కేంద్రం డిగ్రీ విద్యార్థులు ద్వితీయ, తృతీయ సంవత్సరం టర్మ్ ఫీజు చెల్లింపు గడువు ఈనెల 24వ తేదీ వరకు ఉందని రిజిస్ట్రార్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇటీవల డిగ్రీ పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం వేచి చూడకుండా కోర్సుల రుసుము(పరీక్ష ఫీజుతో సహా సంవత్సరం ఫీజు) చెల్లించి పుస్తకాలు పొందాలని సూచించారు. ఎస్‌బీఐ, యూబీఐ ద్వారా డైరెక్టర్, ఎస్‌డీఎల్‌సీఈ, కాకతీయ యూనివర్సిటీ, కేయూ బ్రాంచ్ ఐఎఫ్‌సీ కోడ్ (ఎస్‌బీఐఎన్ 0020262), వరంగల్‌లో చెల్లుబాటయ్యేలా డీడీ తీయాలని, లేదంటే ఎస్‌డీఎల్‌సీఈలోని కౌంటర్‌లో చలానా ద్వారా కూడా చెల్లించవచ్చని వివరించారు. విద్యార్థులు పూర్తి వివరాలకు 0870–2461480, 2461490 నంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

'భద్రాద్రి రాముడు' షూటింగ్ ఇక్కడే..

- భద్రాచలంతో తారకరత్నకు అనుబంధం



భద్రాద్రి రాముడు షూటింగ్ సమయాన అభిమానులతో తారకరత్న (ఫైల్)

భద్రాచలంఅర్బన్: కొద్దిరోజుల క్రితం అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతున్న సినీ నటుడు నందమూరి తారకరత్న శనివారం కన్నుమూశారు. ఈక్రమంలో భద్రాచలానికి ఆయన వచ్చినప్పుడు కలిసిన అభిమానులు తారకరత్న మృతికి సంతాపం ప్రకటించారు. 2004లో సురేష్ కృష్ణ దర్శకత్వంలో నిర్మించిన భద్రాద్రి రాముడు సినిమాలో హీరోగా తారకరత్న నటించారు. ఈ సినిమాను భద్రాచలం చుట్టుపక్క ప్రాంతాల్లోనే ఎక్కువ భాగం చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. స్థానిక నందమూరి అభిమానులకు కొంత సమయం కేటాయించి ఫొటోలు దిగి, సినిమాలో పాత్ర వివరాలు వెల్లడించినట్లు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన మృతి సమాచారం తెలియడంతో అభిమానులు నివాళులర్పించారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆది, సోమవారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారు. ఆదివారం కొత్తగూడెం, జూలూరుపాడు, కల్లూరు, మండలాల్లో జరిగే పలు కార్యక్రమాలకు ఎంపీ హాజరవుతారు.



పాత పాల్వంచలోని ఆత్మలింగేశ్వరాలయంలో బారులుదీరిన భక్తులు



పుష్పాలంకరణలో శివలింగం



అన్నపురెడ్డిపల్లిలో స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



హరహర మహాదేవ !


మహాశివరాత్రి పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భక్తుల శివనామ స్మరణలతో ఆలయాలు మార్మోగాయి. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన అన్నపురెడ్డిపల్లి శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి వారి ఆలయం, సూర్యకిరణాలు నేరుగా శివలింగంపై పడే అరుదైన ఆలయంగా ప్రసిద్ధిగాంచిన పాత పాల్వంచలోని శ్రీ ఆత్మలింగేశ్వరాలయం, దమ్మపేట క్రాస్‌రోడ్‌లోని శ్రీగంగా పార్వతీ సమేత సోమలింగేశ్వర స్వామి ఆలయం, మోతెగడ్డలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయం, ఇల్లెందు సమీపంలోని కోటిలింగాలతో పాటు కొత్తగూడెం పట్టణంలోని పలు ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం గావించారు. పాత పాల్వంచలోని శ్రీ ఆత్మలింగేశ్వరాలయాన్ని కలెక్టర్ దంపతులు, ఇంకా పలు ఆలయాల్లో ఆయా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, పలువురు అధికారులు దర్శించుకుని పూజలు చేశారు. – నెట్‌వర్క్

– వివరాలు 8, 9లో

పర్యాటకంపై పట్టింపేది ?

జిల్లాలో అపార అవకాశాలున్నా వెలికితీయని అధికారులు

- ఎకో, ఇండస్ట్రియల్ టూరిజం స్పాట్లు ఎన్నో..
- మధ్యలోనే నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల నిర్మాణాలు
- 'సీతారామ'తో మారనున్న పర్యాటక రంగం
- పాతవి పట్టాలెక్కితేనే కొత్త వాటికి లైన్ క్లియర్



కిన్నెరసానిలో మధ్యలోనే ఆగిపోయిన అద్దాలమేడ నిర్మాణం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పచ్చని ప్రకృతి, పారిశ్రామిక రంగం, వీటి మధ్య ఆధ్యాత్మిక శోభను కలుపుకుని పర్యాటక రంగాభివృద్ధికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏళ్ల క్రితం నాటి ప్రతిపాదనలు అటకెక్కాయి.

జిల్లాలో టెంపుల్ టూరిజానికి ఎప్పటి నుంచో ప్రాముఖ్యత ఉంది. వివిధ ప్రాంతాల ప్రజలు చేసే పర్యటనల్లో 50 శాతం ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన కోసమే జరుగుతుంటాయి. గడిచిన దశాబ్ద కాలంగా ఎకో, ఇండస్ట్రియల్ టూరిజం కాన్సెప్ట్‌లు కూడా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఇటు సంప్రదాయ, అటు ఆధునిక పర్యాటక రంగాల్లో గొప్పగా అభివృద్ధి చెందేందుకు అన్ని అవకాశాలు జిల్లాలో ఉన్నాయి. తెలంగాణలోనే అడవులు అత్యధికంగా విస్తరించి ఉన్న జిల్లాగా భద్రాద్రికి పేరుంది. పారిశ్రామిక రంగంలో సింగరేణి బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలూ ఇక్కడ ఉన్నాయి. వీటికి తోడుగా దక్షిణ గంగ గోదావరి ప్రవాహం, ఆ నది ఒడ్డున కొలువైన భద్రాద్రి, పర్ణశాల రామయ్యలూ ఉన్నారు. పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన వనరులు జిల్లాలో పుష్కలంగా ఉన్నా, ఆ వనరులను సమర్థంగా ఉపయోగించుకుని, పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు సృష్టించే దిశగా రాజకీయ నాయకులు కృషి చేయడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది.

గతంలోనే ప్రణాళికలు..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత భద్రాచలం – కొత్తగూడేలను కేంద్రంగా చేసుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు వడివడిగా సిద్ధం చేశారు. జిల్లాకు వచ్చే పర్యాటకులకు భద్రాచలం రామయ్య దర్శనంతో పాటు ఇక్కడి అడవుల అందాలు, పారిశ్రామిక వెలుగు జిలుగులు చూపించాలని నిర్ణయించారు. టూరిస్టులు జిల్లాలోకి ప్రవేశించిన వెంటనే కొత్తగూడెంలో ఎకో టూరిజం కాన్సెప్ట్‌లో భాగంగా కిన్నెరసాని ప్రాజెక్టు, అభయారణ్యం, ఇండస్ట్రియల్ టూరిజంలో భాగంగా సింగరేణి బొగ్గు గనులు, కేటీపీఎస్ సందర్శన ఉండేలా ప్లాన్ చేశారు. అందులో భాగంగా కశ్మీర్‌లో దాల్ లేక్ తరహాలో కిన్నెరసాని జలాశయం దగ్గర చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక రూపొందించారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాల్వంచ పట్టణంలో ఉన్న రూరల్ పోలీస్ స్టేషన్‌ను కిన్నెరసాని దగ్గరకు తరలించారు. ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర హరితా హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. సుమారు వంద ఎకరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పార్కును అభివృద్ధి చేశారు. రుద్రంపూర్‌లో ఉన్న 5వ ఇంక్లైన్ మైన్‌ను పర్యాటకుల కోసం సిద్ధం చేయాలని నిర్ణయించారు.



కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వద్ద అసంపూర్తిగా ఉన్న హరిత హోటల్

లోపించిన చిత్తశుద్ధి..

రాజకీయ నాయకత్వంలో చిత్తశుద్ధి లోపించడం, తర్వాత వచ్చిన అధికారులు పర్యాటక రంగాన్ని పట్టించుకోకపోవడంతో జిల్లాలో టూరిజం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది. కొత్తగూడెం సెంట్రల్ పార్కులో ఉన్న కాటేజీల నిర్మాణం పూర్తయినా పర్యాటకులకు అందుబాటులోకి రాలేదు. హరిత హోటల్, కన్వెన్షన్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. కిన్నెరసానిలో హౌజ్ బోట్ కాన్సెప్ట్‌ను మొత్తానికే అటకెక్కించారు. ఇక ఇండస్ట్రియల్ టూరిజంలో భాగంగా సింగరేణి గనుల దర్శన ప్రాజెక్టు కాస్తా గోదావరిఖనికి తరలిపోయింది. ఇటీవలే ఆర్టీసీ – సింగరేణి సంయుక్తంగా హైదరాబాద్ నుంచి పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు సైతం ప్రకటించాయి. స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి రాకపోవడంతో రాష్ట్ర బడ్జెట్‌లోనూ పర్యాటక రంగంలో జిల్లాకు మొండిచేయే ఎదురైంది.

సీతారామ వస్తే..


సీతారామా బ్యారేజీని 37 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. గోదావరిపై శ్రీరాంసాగర్ తర్వాత ఇదే అతి పెద్ద బ్యారేజీ. దీంతో వరద సమస్య తలెత్తకుండా నదికి ఇరువైపులా భారీ ఎత్తున సుమారు 60 కిలోమీటర్ల నిడివితో కరకట్ట నిర్మిస్తున్నారు. బ్యారేజీ, కరకట్ట నిర్మాణం పూర్తయితే దేశంలో ఎక్కడా లేని విధంగా సుమారు 30 కిలోమీటర్ల పొడవుతో భారీ రోడ్ కనెక్టివిటితో అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాంతం సినిమా షూటింగులకు సైతం అనువుగా మారుతుందని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడం గమనార్హం. సీతారామ కరకట్టల కాన్సెప్టు వచ్చిన తర్వాత భద్రాద్రి – భద్రకాళి టూరిజం సర్క్యూట్ సైతం తెర మీదకు వచ్చింది. భద్రాచలం వచ్చిన భక్తులు అటు నుంచి మల్లూరు – మేడారం– రామప్ప/లక్నవరం మీదుగా వరంగల్‌లో భద్రకాళి దర్శనం చేసుకునేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు రూపుదిద్దుకుంటున్నాయి.

మళ్లీ మొదలెట్టాలి..

పర్యాటక రంగంలో జిల్లాకు ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మధ్యలో ఆగిపోయిన హరిత కన్వెన్షన్ సెంటర్, హరిత హోటల్ (కొత్తగూడెం) పనులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు కిన్నెరసాని జలాశయం దగ్గర గతంలో చేసిన ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చేలా డీపీఆర్‌లు రూపొందించి నిధులు వచ్చేలా ఒత్తిడి తీసుకురావాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

విదేశీ విద్య మిథ్యేనా..

- నిధుల కొరతతో విద్యార్థుల ఇక్కట్లు
- రూ.2.40 కోట్ల మేర పెండింగ్
- కార్యాలయాల్లో పేరుకుపోతున్న దరఖాస్తులు



కొత్తగూడెంరూరల్: విదేశాలలో గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు రావడం లేదు. దీంతో సకాలంలో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి కళాశాల యాజమాన్యాల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో ఫీజులు చెల్లించేందుకు ఇక్కడ తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోంది. జిల్లా ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటి వరకు ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్యకు ప్రభుత్వం నుంచి విడుదల కావాలిన్న నిధులు రూ. 2.40 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. విదేశాల్లో డిగ్రీ, ఆపైన చదువుకునే ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఈ పథకం కింద రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తుంది. ఈ మొత్తాన్ని రెండు విడతల్లో రూ. 10 లక్షల చొప్పున విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తుంది. అక్కడ ఫీజు అంతకంటే ఎక్కువగా ఉంటే విద్యార్థులే భరించాల్సి ఉంటుంది. దీంతో పాటు విమాన చార్జీలు అదనంగా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

విదేశీ విద్యకు ఆర్థిక సాయం కోసం జిల్లాలో 2016 నుంచి 2022 వరకు బీసీ విద్యార్థులు 56 మంది దరఖాస్తు చేసుకోగా, 37 మంది దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. 19 మంది మాత్రమే అర్హులు కాగా వారికి రూ. 3.80 కోట్లు చెల్లించారు. ఇక 2022 – 23 విద్యా సంవత్సరంలో 8 మంది దరఖాస్తు చేసుకోగా, వారికి రూ.1.60 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది మైనార్టీ విద్యార్థులు నలుగురు దరఖాస్తు చేసుకోగా, రెండు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మరో రెండు దరఖాస్తులకు సంబంధించి రూ. 40 లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఈ దరఖాస్తులు రాష్ట్ర మైనార్టీ కమిషనర్ వద్ద ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. 2016 నుంచి 2020 వరకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద జిల్లాలో 8 మంది విద్యార్థులు, ఐదుగురు విద్యార్థినులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ. 2,18,50,906 బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఇక 2021 – 22లో నలుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఇద్దరి దరఖాస్తులు తిరస్కరించారు. మరో ఇద్దరికి రూ.40 లక్షలు విడుదల కావాల్సి ఉంది. 2022–23లో నలుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఒకరి దరఖాస్తు తిరస్కరణకు గురైంది. మరో ముగ్గురి దరఖాస్తులు హైదరాబాద్‌లోని ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి విదేశీ విద్యకు బడ్జెట్ విడుదల చేయాలని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భక్తులతో పోటెత్తిన రామాలయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రామాలయంలో భక్తుల రద్దీ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం శనివారం భక్తులతో సందడిగా మారింది. శివరాత్రి సెలవు రోజు కావడంతో భక్తులు స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి వారి మూలమూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. అదేవిధంగా స్వామి వారికి జరిగిన సువర్ణ తులసీ అర్చన, నిత్యకల్యాణ వేడుకల్లోనూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి బేడా మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శ్రీ ఉమాసమేత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ ఉమాసమేత రామలింగేశ్వర స్వామి వారికి శివరాత్రి పర్వదినం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాతఃకాలంలో పంచామృతాభిషేకం జరిపి హారతి సమర్పించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే బారులుదీరి స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా అర్ధరాత్రి నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకకు రామాలయ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు.

మానసిక క్షోభకు గురి చేస్తున్నారు

- వ్యక్తిగతంగా దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇల్లెందు మున్సిపల్ చైర్మన్



సీఐకి ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు

ఇల్లెందు: సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు, పోస్టులతో తనను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శనివారం సీఐ రాజుకు ఫిర్యాదు చేశారు. తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కౌన్సిలర్ గ్రూప్, స్టేషన్ బస్తీ యూత్ గ్రూపుల్లో కొన్ని అభ్యంతరకరమైన పోస్టులు చేశారని, ఆ పోస్టులకు కారణమైన గణేష్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతకాలంగా సాగిస్తున్న సోషల్ మీడియా ప్రచారానికి తెరదించి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఈ విషయమై తాను గతంలో కూడా ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, ఇప్పుడు కూడా అదే వైఖరి ప్రదర్శిస్తే స్టేషన్ ఎదుటే ఆందోళన చేస్తానని చెప్పారు. కాగా, చైర్మన్ డీవీ నుంచి ఫిర్యాదు స్వీకరించిన సీఐ.. ఎఫ్ఐఆర్ నమోదు చేసి రసీదు పత్రం అందజేశారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు వారా రవి, నవీన్, కటకం పద్మావతి, మాజీ కౌన్సిలర్ యలమందల వాసు, బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు. ఈ విషయమై సీఐ రాజును వివరణ కోరగా సోషల్ మీడియాలో ఎవరైనా వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా దూషణలు, అసభ్య పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రాణ భయం ఉంది.. రక్షణ కల్పించండి

ఇల్లెందు మున్సిపాల్టీలో తారాస్థాయికి చేరిన వైరం నేపథ్యంలో తనకు కొంతమందితో ప్రాణ భయం ఉందని, రక్షణ కల్పించాలని చైర్మన్ వెంకటేశ్వరరావు రెండు రోజుల క్రితం ఎస్పీ డాక్టర్ వినీత్‌కు, ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తికి సైతంవినతిపత్రాలు అందజేశారు.

వందనం.. వందేభారత్

- సెంచరీకి చేరువలో ఖమ్మం ప్రయాణికులు
- అభిప్రాయాలు సేకరించిన అధికారులు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్

ఖమ్మంమామిళ్లగూడెం: సికింద్రాబాద్ – విశాఖపట్నం మార్గంలో గత నెల 15వ తేదీ నుంచి మొదలైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఖమ్మం ప్రయాణికులనుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతిరోజు ప్రయాణికులు ఈ రైలును సద్వినియోగం చేసుకుంటున్నట్లు అధికారుల సర్వేలో తేలింది. ఈ రైలులో సౌకర్యాలు, సమయపాలనపై శనివారం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్(సీసీఐ) జాఫర్, స్టేషన్ మేనేజర్ జీఎస్‌వీ.ప్రసాద్ ప్రయాణికులనుంచి అభిప్రాయాలు సేకరించారు. కాగా, ప్రయాణికులు సానుకూలంగా స్పందించారని అధికారులు తెలిపారు.

నెల రోజుల్లో 7వేల మందికి పైగానే...

సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలంగాణలో వరంగల్, ఖమ్మంలో మాత్రమే ఆగుతోంది. దీంతోఅటు సికింద్రాబాద్, ఇటు విశాఖపట్నం నుంచి పలువురు ఖమ్మం చేరుకుంటుండగా, ఇక్కడి నుంచి బయలుదేరుతున్నారు. పగటి పూట ప్రయాణిస్తున్న ఈ రైలు తమకు అనుకూలంగా ఉందని ప్రయాణికులు సర్వే చేసిన అధికారులకు వెల్లడించారు. గత నెల రోజుల్లో ఖమ్మం నుంచి వరంగల్, సికింద్రాబాద్ ప్రాంతాలకు 1,182 మంది ప్రయాణించగా.. విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం వైపు 2,768మంది ఈ రైలు ద్వారా వెళ్లారు. ఇక విశాఖపట్నం వైపు నుంచి 1,274 మంది, 1,806 మంది సికింద్రాబాద్ వైపు నుంచి ఖమ్మం వచ్చారు. ఖమ్మం స్టేషన్ నుండి ప్రతిరోజూ సగటున 95మంది ఈ రైలును వినియోగించుకుంటుండగా, రెండువైపులా పూర్తి సామర్థ్యంతో నడుస్తోంది. కాగా, రైలు సగటున దాదాపు 140శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) నమోదవుతోందని అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

వ్యకాస అఖిల భారత కౌన్సిల్ సభ్యుడిగా మచ్చా

భద్రాచలంఅర్బన్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు సంఘం అఖిల భారత కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ నెల 15 నుంచి 18 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగిన సంఘం ఆలిండియా మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం స్వామి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

దుమ్ముగూడెం: గత డిసెంబర్ 31న జరిగిన ఘర్షణ వ్యవహారంలో ఇరువర్గాలపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవికుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నర్సాపురం-తూరుబాక గ్రామాల మధ్య గతేడాది డిసెంబర్ 31న తూరుబాకకు చెందిన జశ్వంత్‌కు, భద్రాచలానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులకు మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం ఇరువర్గాల వారు కారు అద్దాలను ధ్వంసం చేసుకున్నారు. శనివారం పరస్పరం ఫిర్యాదు చేయగా, జశ్వంత్‌తోపాటు భద్రాచలానికి చెందిన చైతన్య, హర్ష, ప్రేమ్ అనే వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుండాల: ప్రమాదవశాత్తు క్యాంపర్ వాహనం బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని ముత్తాపురం గ్రామ సమీపంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన రమేష్ పటేల్, కేశవ్ పటేల్ అనే వ్యక్తులు నిర్మాణ సామగ్రి తీసుకొచ్చి, వెళ్లే క్రమంలో తూరుబాక వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 ద్వారా గుండాల ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్

బూర్గంపాడు: సోంపల్లి గ్రామం నుంచి సారపాక ఐటీసీ పీఎస్‌పీడీకి జామాయిల్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి సోంపల్లి గ్రామసమీపంలోని వరిమాగాణిలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ట్రాక్టర్ కింద పడిపోయి బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట మండలం దబ్బగూడెం గ్రామానికి చెందిన చీకినేని వెంకటేశ్వరరావు(40) సారపాకకు చెందిన యారం వెంకటేశ్వరరెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం జామాయిల్ లోడ్‌కు వెళ్లి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు ట్రాక్టర్ కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నారాయణపురం గ్రామ సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్ట్ శిఖం భూముల్లో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు చనిపోయిన కోడి పుంజులు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారుకాగా, మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మండల పరిధిలోని చలమప్పగూడెం గ్రామ శివారులో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం... శనివారం చలమప్పగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. కోడి పుంజు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని, నలుగురు పందెంరాయుళ్లపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆక్రమణలో చెరువు శిఖం..



ఊరచెరువు

సుజాతనగర్: ఒక పక్క ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంతో చెరువులను అభివృద్ధి చేస్తుంటే మరో పక్క చెరువు శిఖం భూములను కొందరు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. మండలంలోని గరీబ్‌పేట గ్రామంలో సర్వే నంబర్ 39లోని ఊరచెరువు శిఖం భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఫలితంగా చెరువు కుచించుకుపోతోంది. చెరువు లోతట్టులో సుమారు 20 ఎకరాలకు పైగా స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. ఆక్రమణల వల్ల పంట పొలాలకు సకాలంలో నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

● శైవక్షేత్రాల్లో సందడి..

శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తులకు శైవక్షేత్రాలకు తరలివచ్చారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు హోమాలు జరిపారు. ఎమ్మెల్యేలు, న్యాయమూర్తులు ఆలయాలను దర్శించుకుని పూజలు జరిపారు.

– సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: పాపకొల్లులో అలంకరించిన శివలింగం



బూర్గంపాడు: మోతెగడ్డ ఆలయానికి వస్తున్న భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నీలిమ



పాల్వంచ: ఆత్మలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దంపతులు



పాల్వంచ: ఆత్మలింగేశ్వరాలయంలో భక్తజన సందోహం



పాల్వంచ: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా తదితరులు



ఇల్లెందు: శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ దంపతులు



దమ్మపేట: మల్లేశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి



జూలూరుపాడు: పాపకొల్లు శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్



ఇల్లెందు: కోటిలింగాలలో పూజలు..



అన్నపురెడ్డిపల్లి: శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యేలు మెచ్చా , సండ్ర



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎస్పీ వినీత్ దంపతులు



శివరాత్రి వేడుకల్లో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య దంపతులు...



కొత్తగూడెంటౌన్: బస్టాండ్ సెంటర్‌లోని విశ్వనాథస్వామి ఆలయంలో పాలాభిషేకం..



టేకులపల్లి: సిద్ధారంలో నటరాజ స్వామి ఆలయానికి వస్తున్న భక్తులు

స్టేషన్.. గంజాయి అడ్డా!



ఖమ్మం స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు (ఫైల్)

- ఖమ్మం స్టేషన్ కేంద్రంగా అక్రమ రవాణా
- పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న వైనం
- 'కోణార్క్' ఎక్స్‌ప్రెస్ ఆలంబనగా తరలింపు

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ కేంద్రంగా భారీ మొత్తంలో గంజాయి తరలివెళ్తోందని తెలుస్తోంది. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేస్తున్న పలువురు భువనేశ్వర్ నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈక్రమంలో కొందరు ఖమ్మంలో దిగి పోలీసులకు పట్టుబడుతుండగా.. మరికొందరు రైళ్లలో చేపట్టే తనిఖీల్లో చిక్కుతున్నారు. గత ఆరు నెలలుగా ఖమ్మం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ తనిఖీల్లో వరుసగా గంజాయి పట్టుబడుతుండడం ఇందుకు నిదర్శనమని చెప్పొచ్చు.

రోడ్డు మార్గంలో కాకుండా..

ఒడిశా రాష్ట్రంలోని పలు గ్రామాల్లో గంజాయి కొనుగోలు చేసే వివిధ రాష్ట్రాల వ్యక్తులు తమ స్వస్థలాలకు తరలిస్తుంటారు. రోడ్డు మార్గంలోనైతే చెక్ పోస్టులు, పోలీసుల తనిఖీల్లో పట్టుబడతామని రైలు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే విజయవాడ దాటాక రైళ్లలోనూ పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తుండడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దుకు అతి దగ్గరగా ఒడిశా నుంచి బస్సుల్లో పలువురు గంజాయితో ఖమ్మం వస్తున్నట్లు సమాచారం. ఇక్కడ నుంచి రైలులో గమ్యస్థాలను వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో స్టేషన్‌లోనో.. లేదంటే రైలులోనే ఇక్కడకు వచ్చి రైలు మారుతుండగానో పోలీసులకు పట్టుబడుతున్నారు. అయితే, కొందరు మూత్రశాలలు, ప్లాట్ ఫాం ప్రక్కన గంజాయి బ్యాగ్‌లు పడేసి ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తూ.. పోలీసులు ఏమరుపాటుగా ఉన్న సమయాన రైలు ఎక్కుతున్నట్లు తెలుస్తోంది.

మహిళలే రవాణాదారులు...

పురుషులు గంజాయి తీసుకొస్తే పోలీసులకు పట్టుబడతామనే కారణంతో రవాణాకు మహిళలను ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు. పేదరికంలో ఉన్న మహిళలు డబ్బు ఆశతో ముందుకొస్తున్నా పట్టుబడితే కేసుల తీవ్రత తెలియడం లేదు. ఈక్రమంలో మహిళలను ముందు ఉంచి వెనుక దళారులు ఏమీ తెలియనట్లుగా అనుసరిస్తుంటారని తెలుస్తోంది. గతంలో గంజాయి తీసుకెళ్లేవారు రైళ్లలోని జనరల్ బోగీల్లో రాకపోకలు సాగించగా.. ఇప్పుడు పోలీసులకు చిక్కకుండా ఏసీ బోగీల్లో రిజర్వేషన్ చేయించుకున్నట్లు సమాచారం. కాగా, ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి ముంబైకి రాకపోకలు సాగించే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ద్వారా భారీ మొత్తంలో గంజాయి తరలివెళ్తోందని పోలీసులు గుర్తించారు. ఈక్రమంలో తనిఖీలు విస్తృతంగా చేసినా పట్టుబడుతుంది తక్కువనేనని తెలుస్తోంది.

305కేజీల గంజాయి పట్టివేత

గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో 305 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.65 లక్షలకు పైగా ఉంటుంది. ఆయా కేసుల్లో 16మందిని అరెస్ట్ చేశారు. అయితే ఖమ్మం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు మరింత విస్తృతం చేస్తే గంజాయి సరఫరాను అరికట్టే అవకాశముందని పలువురు చెబుతున్నారు.

● ఉచిత దర్శనానికి నోచుకోని భక్తులు

మణుగూరుటౌన్: మండలంలోని కాకతీయుల కాలం నాటి ప్రాచీన శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉచిత దర్శనం లేకపోవడంతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు. శనివారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్శనానికి తప్పకుండా టికెట్ తీసుకోవాలనే దేవాదాయ శాఖ నిర్ణయంతో అవస్థ పడ్డారు. ఉచిత దర్శనం లేకపోవడంతో ధ్వజస్తంభం వద్దే పూజలు చేసి వెళ్లిపోయారు. శివరాత్రి వేళ ఆలయంలో స్వామివారి ఉచిత దర్శనం లేకపోవడం సరికాదని భక్తులు పేర్కొన్నారు.



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



వీరూ(ఫైల్)

సుజాతనగర్: పండగపూట ఆ ఇంట విషాదం నెలకొంది. పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాల్తియా బాల పెద్ద కుమారుడైన వీరూ (24)కు మూడేళ్ల క్రితం వివాహం జరగ్గా, వివాహం జరిగిన ఏడాదికే విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి మనస్తాపం చెంది మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం కూలి పనికి వెళ్లిన వీరూ ఇంటికి వచ్చి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబానికి పెద్ద కుమారుడైన వీరూ మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పండుగపూట విషాదం

- బైక్ అదుపు తప్పి కాల్వలో పడి యువకుడి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన రాంపండు

పాల్వంచరూరల్: మహాశివ రాత్రి పండుగ రోజు ఆ ఇంట్లో విషాదం నెలకొంది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన పూనం వంశీ, తాటి రాంపండు(19) పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామ సమీపంలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లి శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో రాళ్ల వాగువద్ద బైక్ అదుపు తప్పి కాల్వలో పడింది. దీంతో ద్విచక్రవాహనంపై వెనుక కూర్చుని ఉన్న తాటి రాంపండు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెదాడు. వంశీకి కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహన్ని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నా బిడ్డను ఒక్కసారి చూడనివ్వండి..

లక్ష్మీదేవిపల్లికి చెందిన తాటి నగేశ్, లక్ష్మి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పండుగ రోజు జాతరకు వెళ్లి కొడుకు మృత్యువాతపడటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రి అధికారులు మార్చురీలో ఉంచి తాళంవేశారు. నా బిడ్డను ఒక్కసారి చూడనివ్వండంటూ తల్లి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అయినా అధికారులు మార్చురీ తాళం తీయలేదు. దీంతో తల్లి, కుటుంబీకులు కూడా బయటి నుంచే మృతదేహాన్ని చూస్తూ రోదిస్తూ ఉండిపోయారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావును వివరణ కోరగా.. మృతదేహం రక్షణకోసమే తాళం వేశామని తెలిపారు.



మార్చురీ గదికి తాళం వేయగా, బయటి నుంచే మృతదేహాన్ని చూస్తూ రోదిస్తున్న తల్లి, బంధువులు

75 కేజీల గంజాయి స్వాధీనం

పాల్వంచ: బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఐలు కె.నరేష్, జి.ప్రవీణ్‌కుమార్ పట్టణంలోని నవభారత్ ఏరియాలో పాత అన్నపూర్ణ హోటల్ ముందు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 75 కేజీల 400 గ్రాముల గంజాయి ఉండగా, గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నల్ల గొండ జిల్లా కేతుపల్లి మండలం కొండకిందిగూడేనికి చెందిన డ్రైవర్ పుట్ట సతీష్‌ను, చింతూరు మండలం తులుగొండకు చెందిన వెట్టి లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు. రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని, నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

అశ్వారావుపేటరూరల్: బైక్ చోరీపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుని కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన కూరగాయల వ్యాపారి బాలేపల్లి నాగరాజు తాను ఉండే అపార్ట్‌మెంట్ ఆవరణలో శుక్రవారం రాత్రి స్కూటీ వాహనాన్ని పార్కింగ్ చేశాడు. కాగా తెల్లవారుజామున ఆలయానికి వెళ్లేందుకు వాహనం కోసం చూస్తే కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇలా చూస్తామనుకోలే కొడుకా..

- అమెరికా నుంచి స్వస్థలానికి చేరిన అఖిల్ మృతదేహం
- కుటుంబీకుల రోదనల నడుమ అంత్యక్రియలు



అఖిల్ మృతదేహం

మధిర: అమెరికాలో ఉన్నత చదువులు చదువుతానని వెళ్లాడు.. చదువు పూర్తయ్యాక ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలుస్తానని చెప్పేవాడు.. ఓ పక్క చదువుతూనే మరోపక్క ఆర్థిక అవసరాల రీత్యా ఉద్యోగం చేస్తున్న యువకుడు అక్కడ ప్రమాదవశాత్తు తుపాకీ పేలిన ఘటనలో మృతి చెందగా.. 12 రోజుల అనంతరం మృతదేహం స్వస్థలమైన మధిరకు చేరింది. దీంతో చదువు పూర్తి చేసుకుని వచ్చే కొడుకుకు వివాహం చేయాలని చూస్తున్న ఆయన తల్లిదండ్రులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా రోదించారు. మధిరకు చెందిన మహంకాళి ఉమామహేశ్వరరావు – మాధవి దంపతుల కుమారుడు అఖిల్ శ్రావిక్ (సాయి) ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. అక్కడ మాల్‌లో మరో యువకుడితో కలిసి పనిచేస్తుండగా ఈ నెల 6న తుపాకీని పరిశీలించే క్రమంలో మిస్ ఫైర్ అయి సాయి శరీరంలోకి బుల్లెట్ దూసుకుపోయింది. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా మరుసటి రోజు మృతి చెందాడు. అప్పటి నుంచి ప్రవాసాంధ్రులు, అమెరికాలో ఉంటున్న మధిర వాసులు ఆయన మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు కృషి చేశారు. ఈ మేరకు శనివారం మృతదేహం మధిరకు చేరుకోగా, స్థానిక ఆజాద్ రోడ్డులోని బంధువుల ఇంట్లో కాసేపు ఉంచారు. ఈ మేరకు పన్నెండు రోజులుగా కుమారుడి చివరి చూపు కోసం చూస్తున్న ఉమామహేశ్వరరావు – మాధవి దంపతుల రోదనలు మిన్నంటాయి. ఆ తర్వాత హిందూ శ్మశాన వాటికలో సాయి అంత్యక్రియలు నిర్వహించారు.

తారకరత్న కన్నుమూత



లోకేశ్ పాదయాత్రలో అస్వస్థతకు గురై కుప్పకూలిపోతున్న తారకరత్న (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి

రక్తం గడ్డకట్టడంతో మెదడులో ఒకవైపు వాపు వచ్చినట్టు తెలిసింది. అప్పటి నుంచి బ్రెయిన్‌కు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు చేస్తూ వచ్చారు. తొలుత బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రి నుంచి ప్రత్యేకంగా వైద్యులను పిలిపించి చికిత్స అందించగా, వారం నుంచి విదేశాల నుంచి ప్రత్యేకంగా న్యూరోసర్జన్లు, న్యూరాలజిస్టులను కూడా రప్పించి చికిత్స అందించారు. అయినప్పటికీ తారకరత్న ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మధ్యలో పరిస్థితి కొంచెం మెరుగైందని, చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటున్నారనే వార్తలు వచ్చినా, రెండు రోజులుగా పరిస్థితి మరీ క్షీణించడంతో విషమంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు నందమూరి కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్నారు. పూర్తి సమాచారాన్ని వైద్యులు వారికి వివరించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు వెంటిలేటర్ తొలగించారు.

పాదయాత్ర ప్రారంభం రోజునే..

నందమూరి తారకరత్న గత నెల 27న కుప్పంలో లోకేశ్ పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంట ఉన్న నాయకులు ఆయన్ను అక్కడి నుంచి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయనకు పల్స్ అందడం లేదని వైద్యులు తెలిపారు. అక్కడే క్రిటికల్ కేర్ వైద్యం చేశారు. అయితే తారకరత్న గుండెపోటుతో అప్పుడే ప్రాణాలొదిలినా.. లోకేశ్ పాదయాత్రను దృష్టిలో ఉంచుకుని బెంగళూరు ఆస్పత్రికి తరలించారనే ప్రచారం జరిగింది. లోకేశ్‌కు చెడ్డ పేరు రాకూడదనే ఇన్నాళ్లూ మెరుగైన వైద్యం పేరుతో కథ నడిపించారని టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎట్టకేలకు పర్వదినమైన శివరాత్రి రోజున తారకరత్న శివైక్యం చెందినట్లు ప్రకటించడం గమనార్హం.

అభిమానుల ఆందోళన

తారకరత్న మరణవార్త విన్న నందమూరి అభిమానులు నారాయణ హృదయాలయకు వందలాదిగా చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి వెనుక గేటు నుంచి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. తమకు చివరి చూపు కూడా దక్కకుండా అలా తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ కాసేపు ఆందోళన చేపట్టారు.

ప్రముఖుల సంతాపం

సినీ నటుడు, ఎన్టీఆర్ మనవడు నందమూరి తారకరత్న మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తారకరత్న మరణ వార్త తనకు తీవ్ర దిగ్భ్రాంతి, బాధను కలిగించిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తారకరత్నను బతికించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, కుటుంబ సభ్యులు, అభిమానుల ప్రార్థనలు, అత్యంత నిపుణులైన డాక్టర్ల వైద్యం ఫలితాన్ని ఇవ్వలేదన్నారు. తారకరత్న ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు చంద్రబాబు పేర్కొన్నారు. తారకరత్న మరణంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఒకేసారి 9 సినిమాలతో రికార్డు

ఎన్టీఆర్ ఐదో కుమారుడైన నందమూరి మోహనకృష్ణ, శాంతిమోహన దంపతులకు 1983 ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లో జన్మించారు తారకరత్న. ఛాయాగ్రాహకుడిగా మోహనకృష్ణకు మంచి పేరుంది. చెన్నైలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత హైదరాబాద్‌కు మకాం మార్చిన తారకరత్న జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్‌లో ఉన్నత పాఠశాల చదువు పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని విజ్ఞాన్ భవన్‌లో బీటెక్ చదువుకున్నారు. మొత్తం 23 సినిమాలు, ఒక వెబ్ సిరీస్‌లో తారకరత్న నటించారు. ఆయన చిత్రరంగ ప్రవేశమే ఒక రికార్డు. 20 ఏళ్ల వయసులో ఒక హీరోగా తారకరత్న ఒకేసారి 9 సినిమాలు ప్రారంభించడం అప్పట్లో రికార్డు. 2001లో ఒకటో నంబర్ కుర్రాడు సినిమా ద్వారా తెరంగేట్రం చేశారు. అమరావతి సినిమాతో ఆయనను నంది అవార్డు వరించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో కథానాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా నటించారు. 'మహాభక్త సిరియాల'లో శివ భక్తుడిగా నటించిన తారకరత్న మహాశివరాత్రి నాడు శివైక్యం పొందారు. 2012లో అలేఖ్యరెడ్డిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. నందీశ్వరుడు సినిమాకు అలేఖ్యరెడ్డి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రూ.680 కోట్లతో యకహోమా విస్తరణ

- విశాఖలో మరో యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- ప్రత్యక్షంగా 2,000 మందికి ఉపాధి

సాక్షి, అమరావతి: జపాన్‌కు చెందిన ప్రముఖ టైర్ల తయారీ సంస్థ యకహోమా గ్రూప్ విశాఖపట్నం యూనిట్‌ను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. సుమారు రూ.680 కోట్ల పెట్టుబడితో ప్యాసింజర్ కార్ టైర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ఏడాదికి దాదాపు 17 లక్షల టైర్ల తయారీ సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేయబోతోంది. 2024 చివరి త్రైమాసికానికి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ప్రస్తుతం 28 లక్షల టైర్లుగా ఉన్న ఏటీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 45 లక్షల టైర్లకు చేరుకోనుంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న యూనిట్‌లో 22 అంగుళాల వరకు ఉండే టైర్లను ఉత్పత్తి చేస్తారు. దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోందని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా భారత్ అవతరించిందని.. ఇదే రకమైన వృద్ధి భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని యకహోమా అంచనా వేస్తోంది. 2007లో 7 లక్షల టైర్ల ఉత్పత్తి సామర్థ్యంతో భారత్‌లోకి అడుగుపెట్టిన యకహోమా గ్రూప్ వేగంగా విస్తరిస్తోంది. ఈ గ్రూప్‌కు భారత్‌లో ఇప్పటికే రెండు యూనిట్లు (తిరునల్వేలి, దహేజ్) ఉండగా.. మూడో యూనిట్‌ను విశాఖ సమీపంలోని అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసింది.

సీఎం చేతుల మీదుగా తొలి దశ ప్రారంభం..

యకహోమా గ్రూప్ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసిన అలయన్స్ టైర్స్ కంపెనీ(ఏటీసీ)ని సీఎం వైఎస్ జగన్ ఆగస్టు 16న ప్రారంభించారు. తొలి దశలో రూ.1,384 కోట్లతో హాఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్‌ను ఈ సంస్థ ఏర్పాటు చేసింది. 3.7 కేజీల నుంచి 1.26 కేజీల బరువు ఉండే భారీ టైర్లను ఈ యూనిట్‌లో తయారు చేస్తోంది. ఇక్కడ తయారైన టైర్లను 120కు పైగా దేశాలకు ఎగుమతి చేయనుంది. విశాఖ యూనిట్ల ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది.

మాజీ ఎమ్మెల్యే సర్రాజు కన్నుమూత



సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్యే, ఏపీ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు (72) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైన సర్రాజును భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్రాజు మరణం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హుటాహుటిన భీమవరంలోని ఆదర్శనగర్‌కు చేరుకుని సర్రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'ధరణి' ఇలా దారిలోకి!

▶ మొదటి పేజీ తరువాయి

నివేదికలోని అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా చాలా వరకు 'ధరణి'సమస్యలను పరిష్కరించవచ్చని చెబుతోంది.

సమస్యలపై ట్రెసా నివేదికలోని అంశాలివే...

- వారసత్వ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారం తర్వాత కూడా తహసీల్దార్/ఆపరేటర్ లాగిన్‌లకు సమాచారం రావడంలేదు. సదరు దరఖాస్తులు చేసుకున్న సమయంలోనే తహసీల్దార్/ఆపరేటర్ లాగిన్‌లలో నోటీసు వచ్చేలా ఆప్షన్ ఇవ్వాలి.
- ఒక సర్వే నంబర్‌లోని కొంతభాగం భూమిని గతంలో ఉన్న తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసి ఉంటే, ఆ భూమిని ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే ఆ సర్వే నంబర్‌లోని అన్ని భూములకూ ప్రస్తుత తహసీల్దార్ డిజిటల్ సంతకం కనిపిస్తోంది. అలాకాకుండా ఏ తహసీల్దార్ డిజిటల్ సంతకం చేస్తే వారి సంతకమే కనిపించేలా సరిచేయాలి.
- తహసీల్దార్ లాగిన్‌లలో ప్రస్తుత పహాణీ/భూహక్కుల అంతర్గత పుస్తకం/ పాసు పుస్తకాలు కనిపించడంలేదు. దీంతో రికార్డుల పరిశీలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా భూసేకరణ ద్వారా ప్రభుత్వం తీసుకున్న భూములను పరిశీలించే క్రమంలో సమస్యలు వస్తున్నాయి. తహసీల్దార్ లాగిన్‌లో ప్రస్తుత పహాణీలు, ఆర్‌వోఆర్‌బీలు, పాసుపుస్తకాలు అందుబాటులో ఉంచాలి.
- ఉన్న భూమి కంటే ఎక్కువ, తక్కువగా రికార్డయిన వివరాలను సరిచేసే ఆప్షన్ ఇవ్వాలి.
- రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్లకు సర్టిఫైడ్ కాపీలు తీసుకునే అవకాశం ప్రస్తుతం ధరణిలో లేదు. కానీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం సర్టిఫైడ్ కాపీలిస్తున్నారు. వీటి కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నందున మీసేవ ద్వారా వాటిని తీసుకునే అవకాశం కల్పించాలి.
- ధరణి ప్రాజెక్టు అందుబాటులోకి రాకముందు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లను రద్దు చేసుకునేందుకు, వాటిల్లోని తప్పులను సరిచేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వాలి.
- కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి రాకముందు తహసీల్దార్లు, ఆర్డీవోలు జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలను అమలు చేసే ప్రొవిజన్ ఇవ్వాలి.
- వివాదాల్లో ఉన్న ఇనాం భూములను ప్రాసెస్ చేసేందుకు, ఓఆర్‌సీలు జారీ చేసేందుకు ధరణిలో అవకాశం కల్పించాలి.
- రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత మ్యుటేషన్ జరిగేలోపు పట్టాదారుడు చనిపోతే ఆ పట్టాదారువారసులకు మ్యుటేషన్ చేసే అవకాశం ఇవ్వాలి.
- అసలైన పట్టాదారులను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచనతో కొందరు మీసేవ కేంద్రాల ద్వారా పట్టాభూములను నాలా కోసం దరఖాస్తు చేస్తున్నారు. దీంతో అసలైన పట్టాదారులకు ఇబ్బంది అవుతోంది. అలాంటి థర్డ్ పార్టీ దరఖాస్తులను రద్దు చేసే ఆప్షన్ ఇవ్వాలి.
- సిటిజన్ పోర్టల్ ద్వారా భూముల నిర్వహణ, సేల్ సర్టిఫికెట్, ఎక్స్ఛేంజ్ డీడ్‌లు చేసుకునే అవకాశం పవర్ ఆఫ్ అటార్నీలకు ఇవ్వాలి.
- ధరణిలో తప్పుగా నమోదై, డిజిటల్ సంతకాలు కాని ఎంట్రీలను తొలగించే ఆప్షన్ ఇవ్వాలి. రిజిస్టర్డ్ డాక్యుమెంట్లలో పొరపాటున పడిన చిన్న, చిన్న తప్పులను సవరించుకునే అవకాశం కూడా ఇవ్వాలి.
- కొన్ని అసైన్డ్ భూముల రికార్డుల్లో భూమి స్వభావాన్ని పొరపాటున పట్టా అని నమోదు చేశారు. ఈ కారణంతో ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో కనిపిస్తున్నాయి. ఈ రికార్డులను సరిచేసే ఆప్షన్ టీఎం-33లో కనిపించడం లేదు. దీంతో అసైన్డ్ భూములకు వారసత్వహక్కులు కూడా కల్పించలేకపోతున్నాం.
- రెండు ఖాతాలు కలిగిన రైతులు ఒక ఖాతాలో ఆధార్ నమోదు చేసుకోకపోతే మళ్లీ నమోదు చేసుకునేందుకు ధరణి పోర్టల్ అనుమతించడం లేదు. మీరు నమోదు చేసిన ఆధార్ నంబర్ ఇప్పటికే ఉందని చూపిస్తోంది. ఈ సమస్యను సవరించాలి.
- ఆర్డీవో స్థాయిలో ఇప్పటికే ప్రొసీడింగ్స్ వచ్చిన భూములకు వ్యవసాయ కేటగిరీ నుంచి నాలా కేటగిరీకి మార్చుకునే అవకాశం కల్పించాలి.
- వీలునామాలను అమలు పరిచే ఆప్షన్ ఇవ్వాలి.

ఏపీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా జోగినాయుడు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా సినీనటుడు ఎల్.జోగినాయుడుని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్‌లోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన జోగినాయుడు చలనచిత్ర నటుడిగా 150కి పైగా చిత్రాలలో నటించారు. చిత్ర, టెలివిజన్ రంగాలలోని పలు విభాగాలలో దాదాపు 25 ఏళ్ల అనుభవం ఉంది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. జోగినాయుడు నియామకానికి సంబంధించి ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ విజయవాడ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

మోదీకి దేశ ప్రయోజనాల కంటే అదానీయే ముఖ్యం

మంత్రి కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో ఇచ్చిన హామీని ప్రధాని నరేంద్ర మోదీ పట్టించుకోకపోవడం వెనుక అసలు కారణం ఏమిటో ఇప్పుడు తెలిసిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. ప్రధాని మోదీకి దేశ ప్రయోజనాలకంటే స్నేహితుడి ప్రయోజనాలే ఎక్కువ కావడం సిగ్గుచేటని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బయ్యారం స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందని బీఆర్ఎస్ నేత, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియోను కేటీఆర్ రీ ట్వీట్ చేశారు. క్రిశాంక్ మంచి పరిశోధన, గొప్ప విశదీకరణ చేశారని కేటీఆర్ మెచ్చుకున్నారు. 'విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బైలడిల్లా గనుల నుంచి బయ్యారానికి ముడి ఇనుము సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కానీ ప్రధాని మోదీ మాత్రం తెలంగాణ వినతిని పట్టించుకోకుండా బైలడిల్లా నుంచి కొరియన్ కంపెనీ పోస్కోకు ముడిఇనుమును సరఫరా చేయాలని 2018 ఏప్రిల్ 25న నిర్ణయించారు. ఈ క్రమంలో 2018 సెప్టెంబర్ 20న గుజరాత్ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ బైలడిల్లాను టేకోవర్ చేశారు. పోస్కో కంపెనీ, అదానీ కంపెనీ కలసి రూ.37,500 కోట్ల స్టీల్ ప్లాంట్ డీల్‌పై సంతకాలు చేశాయి'అని క్రిశాంక్ తన వీడియోలో పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

రోల్ 'మోడల్'గా నిలిచేందుకు..

- మోడల్ స్కూల్ పిలుస్తోంది..
- వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 22 వరకు గడువు
- గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్య, పౌష్టికాహారం



పెనుబల్లిలో మోడల్ స్కూల్

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత, పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తూనే, రుచికరమైన పౌష్టిక ఆహారం సమకూరుస్తున్నారు. ఆధునిక వసతులతో పాటు ఇంగ్లిష్ మీడియం విద్య బోధిస్తుండగా.. పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం సాధారణ పాఠశాలలకు భిన్నంగా విద్యాప్రమాణాలు మరింత పెరిగేలా మోడల్ పాఠశాలలను నిర్వహిస్తోంది. వచ్చే విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలకు పోటీ పడే అవకాశముందని భావిస్తున్నారు.

జిల్లాలో రెండు పాఠశాలలు

ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి, కారేపల్లి మండలాల్లో రెండు మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో ఏటా ఆరో తరగతిలో వంద మందికి ప్రవేశాలు కల్పించి పదో తరగతి వరకు బోధిస్తారు. ఇక పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్‌లోనూ ప్రవేశాలు ఉంటాయి. అయితే, ఆయా తరగతుల్లో ఎవరైనా మధ్యలో మానిస్తే ఆయా సీట్లను మాత్రమే ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.

నోటిఫికేషన్ వివరాలిలా

వెబ్‌సైట్	: http:/telanganagms.cgg.gov.in
ఏమేం సమర్పించాలి	: కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణపత్రాలు, ఆధార్‌కార్డు
దరఖాస్తుల స్వీకరణ గడువు	: ఈనెల 22వరకు
6వ తరగతి ప్రవేశపరీక్ష	: ఏప్రిల్ 16 (ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు)
7నుంచి 10వ తరగతుల వారికి ప్రవేశపరీక్ష	: ఏప్రిల్ 16 (మధ్యాహ్నం 2నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు)
ఫలితాల విడుదల	: మే 15
ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల	: మే 24
ధ్రువపత్రాల పరిశీలన	: మే 25నుంచి 31వ తేదీ వరకు
తరగతులు ప్రారంభం	: జూన్ 1 నుంచి

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు పొందాలనుకునే వారు ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. గత నెల 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుండగా 22వ తేదీతో గడువు ముగియనుంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు విశేషంగా కృషి చేస్తోంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

నానో టెక్నాలజీపై ఎంఓయూ

నిట్‌తో జిగాంటో టెక్నాలజీ ఒప్పందం



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న నిట్, జిగాంటో బాధ్యులు

కాజీపేట అర్బన్: వరంగల్ నిట్, అహ్మదాబాద్‌లోని జిగాంటో టెక్నాలజీస్ ఎల్ఎల్‌పీ శనివారం ఎంఓయూ కుదుర్చుకున్నాయి. నిట్ వరంగల్‌లోని కెమికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ శిరీష్ సోనావానే తన బృందంతో నానో టెక్నాలజీ అంశంలో చేపట్టిన పరిశోధనకు భారత ప్రభుత్వం పేటెంట్ అందజేసింది. ఈ టెక్నాలజీపై జిగాంటో టెక్నాలజీ ఎల్ఎల్‌పీ డైరెక్టర్ ఆదిత్యప్రతాప్‌సింగ్, నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈకార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి రూ.6 లక్షల విరాళం



ఆలయ కమిటీ, అర్చకులకు నగదు అందజేస్తున్న దాతలు

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో మలినాథ నాగ శివాలయ నిర్వహణకు భక్తులు భారీ విరాళం సమర్పించారు. గ్రామానికి చెందిన తన్నీరు విశ్వనాథం – సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు తన్నీరు కోటేశ్వరరావు – మాధవి దంపతులు రూ.5 లక్షల నగదును మహాశివరాత్రి సందర్భంగా శనివారం అందజేశారు. అలాగే, విశ్వనాథం కుమార్తెలు, కుటుంబ సభ్యులు శ్రీదేవి, వెంకటేశ్వర్లు, మంజు, రాములు కలిపి మరో రూ.లక్షను ఆలయ కమిటీకి అందజేయగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇదే కుటుంబం గతంలో శివాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళంగా అందజేసింది.

రామయ్యకు బంగారు హారం

- రూ.3.69 లక్షల విలువైన ఆభరణం సమర్పించిన తమిళనాడు భక్తులు



హారాన్ని ఏఈఓకు అందజేస్తున్న భక్తులు



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన భక్తులు శనివారం బంగారు హారాన్ని సమర్పించారు. కోయంబత్తూర్‌కు చెందిన బాలాజీ మణిగందన్ దంపతులు 60 గ్రాముల బంగారంతో రూ.3.69 లక్షల విలువైన హారాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈ హారాన్ని శనివారం స్వామి వారి పాదాల చెంతన ఉంచి ప్రత్యేక పూజలు చేశాక ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కత్తి శ్రీనివాస్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపకుడు సర్వాయి పాపన్నగౌడ్



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన జెడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, తదితరులు

నేలకొండపల్లి: తెలంగాణ గడ్డపై తొలిసారి బహుజన రాజ్యాన్ని స్థాపించిన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఖమ్మం జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి తెలిపారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఎంపీటీసీ ఉసిరికాయల లక్ష్మయ్య శనివారం ఆవిష్కరించగా, ఆ తర్వాత జరిగిన సభలో ధనలక్ష్మి మాట్లాడారు. బహుజనుల కోసం ఆనాడే పాపన్న పోరాడారని, అందరినీ కలుపుకుపోయి కుల వృత్తులను కాపాడిన చరిత్ర ఆయనదని గుర్తుచేశారు. వ్యవస్థలో ఆధిపత్యం, బానిసత్వాన్ని ధిక్కరించారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సర్పంచ్ కొంగ్రు విజయలక్ష్మి, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని వెంకన్నతో పాటు మారగాని నర్సింహారావు, మారగాని సత్యనారాయణ, మారగాని పూర్ణచందర్‌రావు, వీరయ్య, మారగాని రాజా, మారగాని లక్ష్మీనారాయణ, వీరబాబు, వెంకయ్య, మల్లికార్జున్‌రావు, శ్రీనివాసరావు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం

కబడ్డీ పోటీలను ప్రారంభించిన సీఎల్పీ నేత భట్టి



నేరడలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఎల్పీ నేత భట్టివిక్రమార్క

చింతకాని: క్రీడలు యువతలో స్నేహభావం, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండలం నేరడలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యాన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయగా శనివారం భట్టివిక్రమార్క ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్న తరుణాన నేతాజీ యువజన సంఘం బాధ్యులు గత 41 ఏళ్ల నుంచి పోటీలను నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని భట్టి హామీ ఇచ్చారు. తొలుత ఆయన క్రీడా పతాకాన్ని ఎగువేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్రెముచ్చు ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ దూసరి గోపాల్‌రావు, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపకులు దూసరి శ్రీరాములు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు దూసరి నేతాజీ, పులిపాటి వెంకయ్య, కొప్పుల గోవిందరావు, కన్నెబోయిన గోపి, వనం చిన్నప్ప, షేక్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

పెంకు కార్మికుల వేతనాల పెంపునకు ఒప్పందం



వివరాలు వెల్లడిస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసు

ఇల్లెందురూరల్: భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని పెంకు కార్మికుల వేతనాలపై యజమానులు, ఇఫ్టూ అనుబంధ తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధుల మధ్య శనివారం జరిగిన చర్చలు విజయవంతమయ్యాయి. ఈ మేరకు వేతన ఒప్పందం వివరాలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏసు వెల్లడించారు. దినసరి కూలీకి రోజుకు రూ.25 చొప్పున పెంచగా, కాంట్రాక్టు కార్మికులకు గత వేతనాలపై 8 శాతం పెంచారని, నెలకు రూ.10 వేల లోపు వేతనం తీసుకుంటున్న వారికి 9 శాతం, ఆపైన వేతనాలు ఉన్న వారికి 8 శాతం పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. అలాగే, ప్రతీ ఆదివారం సెలవు, వేతన బకాయిల చెల్లింపుపై కూడా ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఆరెల్లి కృష్ణ, జె.సీతారామయ్య, మదార్, రాంసింగ్, ఏపూరి వీరభద్రం, యజమానులు బెల్లం వెంకటేశ్వరరావు, అనిల్, విక్రమ్‌రెడ్డి, అరవింద్, రమేశ్, పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు.